నాసిరకం చిరుతిళ్లు.. ఆరోగ్యానికి చేటు

- చిన్నారులే లక్ష్యంగా తయారీ
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నాణ్యతా ప్రమాణాలు పాటించని తయారీదారులు

కాజులూరు: మార్కెట్‌లో కొనుగోలు చేసే నాశిరకం చిరుతిళ్ల వలన ప్రజారోగ్యానికి భంగం వాటిల్లుతుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. పలు రకాల చిరుతిళ్లు తయారు చేసే నాసిరకం బ్రాండ్లను గతంలో ప్రభుత్వం నిషేధించిన సందర్భాలున్నాయి. చిరుతిళ్ల విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో నాణ్యతలేని ఆహార పదార్థాలు నియోజకవర్గంలోని గ్రామాల్లో విజృంభిస్తున్నాయి. ఆకట్టుకునే కార్టూన్లు, రంగుల ప్యాకింగ్‌లతో కిల్లీషాపులు, కిరాణా షాపులు, బేకరీల వద్ద ఇవి దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలని చిన్నారులు మారాం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో తల్లితండ్రులు కొనుగోలుచేసి ఇవ్వటం పరిపాటిగా మారుతోంది. నాణ్యతాప్రమాణాలు పాటించకుండా తయారు చేసే చిరుతిళ్లను తింటే చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. విటి అమ్మకాలు ఇలాగే జరిగితే భవిష్యత్తులో ప్రజారోగ్యానికి పెనుముప్పు తప్పదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

నకిలీ చిరుతిళ్లతో రూ.లక్షల్లో వ్యాపారం

ఈ చిరు తినుబండారాలే ప్రమాదమనుకుంటే అసలును పోలిన నకిలీలు గ్రామాల్లో హల్చల్ చేస్తున్నాయి. ధనార్జనే లక్ష్యంతో అక్రమంగా కొంత మంది బ్రాండ్లను పోలిన నకిలీ చిరుతిళ్లను తయారు చేసి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లలో మార్కెట్‌లోకి వదులుతున్నారు. ఈ స్నాక్స్, చిరుతిళ్ల ప్యాకింగ్‌లపై పరిశ్రమ చిరునామా, తయారీ తేదీ, వాడిన పదార్థాలు తదితర వివరాలేవీ ఉండదు. ప్రముఖ కంపెనీలను పోలి ఆకర్షణీయంగా ప్యాకింగ్ ఉండటం, మార్జిన్ కూడా ఎక్కువగా ఉండటంతో స్వలాభం కోసం వ్యాపారులు, షాపు యజమానులు వీటి అమ్మకాలనే ప్రోత్సహిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా నాశిరకం చిరుతిండ్ల వ్యాపారం రోజుకు రూ.లక్షల్లో ఉండచ్చునని నిపుణుల అంచనా. గతంలో హైద్రాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి దిగుమతయ్యే ఈ నకిలీ తినుబండారాలు ఇటీవల స్థానికంగా జిల్లాలోనే తయారవుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.


మార్కెట్‌లో చిరుతిళ్ల ప్యాకెట్లు

తనిఖీలేవీ ?

మార్కెట్‌లో అమ్ముడుపోయే చిరుతినుబండారాల అమ్మకాలపైనా అధికారుల పర్యవేక్షన కొరవడింది. మొక్కుబడిగా దాడులు చేసినా పెద్ద మొత్తాల్లో ముడుపులు అందడంతో పర్యవేక్షణ గాలికొదిలేశారని ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. తూనికలు, కొలతల అధికారులు పత్తాలేకుండా పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తింటే రోగాలు తెచ్చుకున్నట్టే..

మార్కెట్‌లో దొరికే చిరుతినుబండారాలు ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు పలు రకాల రసాయనాలు, వాయువులు వాడతారు. రుచి ఎక్కువగా ఉండటానికి అధిక మోతాదులో మసాలాలు, టేస్టింగ్ సాల్టు కలుపుతారు. ఆకర్షణీమైన రంగులకోసం పలు రకాల పౌడర్లు ఉపయోగిస్తారు. వీటిని పిల్లలు ఎక్కువగా తింటే భవిష్యత్తులో వారికి అనారోగ్య సమస్యలు తప్పవని వైద్యులు చెబుతున్నారు. ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశం ఉంది.

పూర్తిగా నిషేధించాలి



పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిళ్లు ఇవ్వటం పూర్తిగా నిషేధించాలి. రెడీమేడ్ స్నాక్స్ వలన కలిగే అనారోగ్యాలు, ప్రమాదాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు వివరించాలి. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లను చూసి పిల్లలు అవేకావాలని మారాం చేస్తే తల్లితండ్రులు సహజసిద్ధమైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను, పండ్లు, కాయల ఇచ్చి వారి దృష్టిని మళ్లించాలి.

– గండం వసంతరావు, ఉపాధ్యాయుడు, వెల్ల

నకిలీకి దూరంగా ఉండాలి



మార్కెట్‌లో అమ్ముడుపోయే చిరుతినుబండారాలు, జంక్ ఫుడ్‌లకు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వీటిలో ఉపయోగించే రసాయనాలు, రంగుల వలన కడుపునొప్పి, అజీర్తితో పాటు, భవిష్యత్తులో జీర్ణకోశ సమస్యలు, కిడ్నీ వ్యాధులు, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ చిరుతిళ్ల విషయంలో పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ ఎస్ సౌజన్య,
మెడికల్ ఆఫీసర్, గొల్లపాలెం పీహెచ్‌సీ

క్లుప్తంగా

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

కపిలేశ్వరపురం: బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని అలమూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న వక్తలు అన్నారు. మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీలో నిర్వహించిన సదస్సు నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కరుణేంద్రకుమారి, డాక్టర్ దీపిక, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బి.విద్యాప్రసన్న, న్యాయవాది కె. ధనరాజు బాల్య వివాహాలకు సంబంధించిన న్యాయపమైన అంశాలను వివరించారు.

నానో యూరియా వినియోగించాలి

కాజులూరు: నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పొలంలో అడుగులోతుకు పైబడి వానపాములు వంటి జీవులు జీవిస్తాయన్నారు. ఇవి భూసారం పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. యూరియా పొలాల్లో అధికంగా వేయటం ద్వారా రైతు నేస్తాలుగా పిలుసుకునే ఈ వానపాములు నశిస్తున్నాయన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి దాని స్థానంలో నానో యూరియాను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో తనిఖీ


భవిత కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ నరసింహ

రామచంద్రపురం రూరల్: సమగ్ర శిక్ష రాష్ట్ర ఐఈ కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహ రామచంద్రపురం భవిత కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు అందిస్తున్న విద్య, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు ప్రభుత్వ అందిస్తున్న సదుపాయాలను, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈఓలు తాడి వీర రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, భవిత కేంద్రం నిర్వాహకులు బాబు, నాగమణి పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే తెగుళ్లను నివారించాలి


చెల్లూరులో పొలం బడిలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

రాయవరం: మండలంలోని చెల్లూరులో మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలం బాట నిర్వహించారు. పొలం పరిసరాల విశ్లేషణలో భాగంగా వరి పొలంలో కనిపించే మిత్ర, శత్రు పురుగుల వల్ల కలిగే లాభ నష్టాలను రైతులకు వివరించారు. వరి పైరులో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆకు ముడత, కాండం తొలిచే పురుగుల నివారణకు సాధారణంగా వాడే రసాయన పురుగు మందులను, వేపనూనెతో కలిపి వాడితే ప్రాథమిక దశ అయిన గుడ్ల రూపంలో ఉన్న పురుగులను కూడా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కె.బాబూరావు మాట్లాడుతూ రసాయనే పురుగు మందులు ప్రత్యామ్నాయంగా పేడ– ఇంగువ ద్రావణాన్ని ఎకరానికి 200 లీటర్ల నీటికి 5 లీటర్ల ద్రావణాన్ని కలిపి వాడాలని సూచించారు. పేడ మూత్రం ఇంగువ తయారు చేసిన ద్రావణాన్ని 1–2 రోజులు మాత్రమే నిల్వ ఉంచుకోవాలని, రసాయన మందులతో కలిపి వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో పొలంబడి రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదున్నర కిలోల లడ్డూ రూ.39,116

మామిడికుదురు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా నగరం మల్లాయిపాలెంలో బాల గణపతి స్వామి మండపం వద్ద శుక్రవారం అన్న సమారాధన జరిగింది. అనంతరం వినాయకుని చేతిలో పెట్టిన ఐదున్నర కిలోల లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. అదే గ్రామానికి చెందిన మోనిక ఆర్కే అనే భక్తురాలు ఆ లడ్డూను రూ.39,116కు దక్కించుకున్నారు. ఆ లడ్డూను ఊరేగింపుగా తీసుకు వెళ్లి భక్తులకు ప్రసాదంగా పంచారు.

వికలాంగుల పింఛన్లు తొలగించడం దారుణం


పండు గోవిందరాజు

కె.గంగవరం: అర్హులైన వికలాంగులకు సర్వేలు, తనిఖీల పేరుతో నోటీసులు అందించి వారిని బాధపెట్టడడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు అన్నారు. కె.గంగవరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలిచ్చి ఎన్నికల్లో గెలిచి 14 నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వలేదని, ఉన్న పింఛన్లను పునఃపరిశీలన పేరుతో తొలగించేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమని గోవిందరాజు అన్నారు. నోటీసులు జారీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారని కొంతమంది ఆందోళనతో మృతి చెందారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని యథావిధిగా అర్హులందరికీ పింఛన్లు అందించాలని కోరారు. నూతన పింఛన్ల కోసం వృద్ధులు, అర్హత కలిగిన వారు చాలా ఆశతో ఎదురు చూస్తున్నారని వారందరికీ కుంటి సాకులు చెప్పకుండా పింఛన్లు అందించాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలని హితవు పలికారు.

13న జాతీయ లోక్ అదాలత్

రామచంద్రపురం: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ వచ్చేనెల 13న రామచంద్రపురం కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామని, ఈ సదావకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీబీ సకీనాకు కన్నీటి నివాళి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో శుక్రవారం ముస్లింల ఆరాధ్య దైవం ఇమాం హుస్సేన్ కుమార్తె బీబీ సకీనా వర్ధంతిని ఇస్లాం విశ్వాసులు నిండు శోకంతో నిర్వహించుకున్నారు. స్థానిక బీబీ సకీనా పంజాలో ముంబై నుంచి వచ్చిన మత గురువులు మౌలానా బిలాల్ కాజ్మీ, మీర్జా అస్కరి హుస్సేన్ తదితరులు బీబీ సకీనా చెరసాలలో పడిన కష్టాలను మజ్లిస్‌ల రూపంలో వివరించారు. సాయంత్రం పీర్ (బీబీ సకీనా అలం)ను గుర్రంపై ఉంచి బీబీ సకీనా పంజా నుంచి పెద్ద మసీదు సెంటర్‌లోని 4వ ప్రవక్త జైనుల్ అబేది పంజా వరకు మాతం చేస్తూ ఊరేగించారు. ఇతర రాష్ట్రాల నుంచి చుట్టు పక్కల జిల్లాల నుంచి ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమన్ సంఘాలు, ధర్మకర్తలు భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.


ద్రాక్షారామలో గుర్రంపై ఊరేగిస్తున్న బీబీ సకీనా పీర్

గృహ నిర్మాణ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

రామచంద్రపురం: పట్టణంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి ఒక్కొక్క లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసిన ముగ్గురు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు కౌన్సిల్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత నిర్వహించిన సాధారణ సమావేశంలో మొత్తం 23 అంశాలను సభ్యుల ఆమోదానికి వివరించగా అందులో 22వ అంశాన్ని వాయిదా వేశారు. అత్యవసర సమావేశంలో 23 అంశాల్లో అభివృద్ధి పనులకు చెందిన టెండర్లను ఆమోదించారు. కౌన్సిలర్లు సాయిప్రసాద్ తదితరులు మాట్లాడుతూ పట్టణానికి చెందిన ముగ్గురు కాంట్రాక్టర్లు జగనన్న కాలనీలో లబ్ధిదారుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారన్నారు. గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్ పర్సన్ శ్రీదేవి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం కౌన్సిలర్లు పలు సమస్యలపై చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా దీనిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ శ్రీదేవి


సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు, అధికారులు

ఏటిగట్టు రహదారి అధ్వానం


గుంతలమయంగా ఏటిగట్టు రహదారి

కె.గంగవరం: ఆహ్లాదకరంగా ఉందని గోదావరిని చూస్తూ వాహనాలు నడిపితే ప్రమాదం బారిన పడి ఆసుపత్రి పాలవ్వాల్సిందే. పర్యాటకంగా ఆహ్లాదకరంగా ఉండే జొన్నాడ–యానాం ఏటి గట్టు రోడ్డు అడుగుకోగుంతలతో, రహదారికి ఇరువైపులా బెర్ములు లేక ప్రమాదకరంగా మారింది. గత పుష్కరాల్లో రూ.30 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రోడ్డు బాగుండడంతో జొన్నడ–యానాం రహదారిలో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక రవాణా చేసే భారీ లారీల రాకపోకల కారణంగా గుంతలమయంగా మారింది. పూర్తిస్థాయిలో బెర్ములు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. కోటిపలి–కోట, బ్రహ్మపూరి– గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు గుంతలతో, కోతకు గురై బెర్ములు లేక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

గణపతి లడ్డూ ప్రసాదం వేలం

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం గణపతి నవరాత్ర శిబిరాలు సందడిగా మారాయి. ఉదయం శిబిరాల్లోని పీఠంపై పుణ్య దంపతులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంగరలోని శ్రీఆదిగణపతి నవరాత్ర శిబిరంలో గురువారం రాత్రి భక్తుడు సూరంపూడి గోవిందు స్వామికి సమర్పించిన 5 కిలోల లడ్డూకు వేలం నిర్వహించగా అంగర ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ రూ.1,500 పాడుకున్నారు. భక్తులకు ప్రసాదంగా లడ్డూను అందజేస్తానని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తెలిపారు.

మున్సిపల్ స్థలం అన్యాక్రాంతంపై ఆగ్రహం

- మున్సిపల్ అధికారుల అలసత్వాన్ని ప్రశ్నించిన కౌన్సిలర్లు
- షాపుల అద్దె వసూలు తీరుపైనా అసహనం
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం అవుతుండగా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కొందరు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే వేగుళ్ల హాజరయ్యారు. పలు అంశాలపై కౌన్సిలర్లు ,మధ్యా, కౌన్సిలర్లు అధికారులకూ మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. 13 అంశాలతో కూడిన అజెండాను కమిషనర్ టీవీ రంగారావు వెల్లడించగా అంశాలు వారీగా చైర్ పర్సన్ దుర్గారాణి చర్చను నడిపారు. కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతో మున్సిపల్ వాటర్ వర్క్సకు సంబంధించిన స్థలం అన్యాక్రాంతం అయిన అంశంపై రాధాకృష్ణ అధికారుల తీరును ప్రశ్నించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వేగుళ్ల వీర్రాజు హయంలో వాటర్ వర్క్స సంబంధించిన భూమిని ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేసి పురపాలక సంఘానికి అప్పగించారని ఆయన గుర్తుచేశారు. గతంలో పలు కౌన్సిల్ సమావేశాల్లో సైతం ఇదే విషయాన్ని లేవనెత్తినా మున్సిపల్ అధికారుల తీరు మారడంలేదని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ రంగారావు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తలెత్తిన సాంకేతిక అంశాలను వివరించారు. మున్సిపల్ షాపుల అద్దె బకాయిల వసూలు విషయంలో అధికారుల తీరు సరికాదనంటూ ఎమ్మెల్యే జోగేశ్వరరావు, రెడ్డి రాజుబాబు అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మున్సిపల్ అధికారులను అడిగినప్పుడల్లా సచివాలయం పరిధిలో ఉందంటూ సమాధానం చెబుతుండటాన్ని తప్పుబట్టారు. 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎస్సీ శ్మశాన వాటికకు రంగులు వేయించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ మెండు బాపిరాజు మాట్లాడుతూ గొల్లపుంత రోడ్డులో మద్యం షాపు ఉండటంతో మందుబాబులు సమీప లే అవుట్లు, రహదారులపై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బస్‌స్టాండ్‌లోని రిక్షా స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉన్న బోర్డు తొలగించడంపై కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. చైర్ పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పట్టణంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలు అంశాలపై తీర్మానాలు చేశారు.


మండపేట కౌన్సిల్ సమావేశంలో రెడ్డి రాధాకృష్ణ, సభ్యులు


మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


దంగేరు ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు


వెల్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసిన ఉపాధ్యాయులు, పెద్దలు


వెంటూరులో నిర్వహించిన తెలుగు భాషా, క్రీడా దినోత్సవ పోటీల్లో విజేతలకు బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు భాషా పండితులు మాట్లాడుతూ తెలుగు భాషకు గిడుగురామ్మూర్తి పంతులు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు తెలుగు భాషపై పద్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. దంగేరు ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు అ, ఆ అక్షరాలుగా కూర్చుని ఆకట్టుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత


రామచంద్రపురం రూరల్: వెల్ల జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రారాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు, తెలుగు సాహిత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామానికి చెందిన దాత దూడల నాగభూషణం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర ఆదినారాయణ, వైస్ చైర్మన్ పందిరి శాంత కుమారి, సభ్యులు సుంకర శ్రీనివాసరావు, కుక్కల పద్మజారాణి, గ్రామ పెద్దల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశఋాల పీఈటీ బి. కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి కృషి ఎనలేనిది

రాయవరం: తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదని పలువురు పేర్కొన్నారు. సోమేశ్వరం, వెంటూరు, రాయవరం, పసలపూడి, చెల్లూరు, కూర్మాపురం, వెదురుపాక, మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సోమేశ్వరం హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాత తాడి రామచంద్రారెడ్డి సౌజన్యంతో క్రీడా పోటీల్లో విజేతలకు రూ.25వేలు విలువైన బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం దయామణి ఆధ్వర్యంలో దాత రామచంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.శాంతిసునీత ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కేవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుల డివిజన్ ఇన్‌చార్జి, పాఠశాల పీడీ ఆని శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు పతకాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు

దాత సహకారంతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు


పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించిన సుహాస్‌రెడ్డి తదితరులు

రాయవరం: పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన దాత, పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి (బాబులు) సౌజన్యంతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. బాబులు అయన కుమారుడు సుహాస్‌రెడ్డి చేతుల మీదుగా రూ.82వేలు విలువైన సైన్స్ పరికరాలు, వాటిని అమర్చుకునేందుకు అవసరమైన ఫర్నీచర్‌ను అందజేశారు. సుహాస్‌రెడ్డి చేతుల మీదుగా ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మరో దాత, పారిశ్రామికవేత్త చింతా సుబ్బారెడ్డి అసెంబ్లీ నిర్వహణ, కమ్యూనిటీ మొబలైజేషన్ నిమిత్తం పాఠశాలకు రూ.50వేలు విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఇరువురు దాతలు పాఠశాల హెచ్‌ఎం నూలు ఆదినారాయణకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆదినారాయణ, ఉప సర్పంచ్, మాజీ ఎంపీపీ పోతంశెట్టి సాయిరామ్మోహన్ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, వార్డు సభ్యుడు మల్లిడి రామారెడ్డి తదితరులు మాట్లాడుతూ పాఠశాల, విద్యాభివృద్ధికి దాతలు చేస్తున్న కృషిని అభినందించారు. ఉపాధ్యాయులు కుక్కల శ్రీనివాస్, జోసఫ్‌కుమార్, చింతపల్లి శ్రీనివాసరావు, వీరభద్రరావు, ఎం.రాంబాబు, పీఎస్ తిరుమలరావు, సీహెచ్.సూర్యలోవ పాల్గొన్నారు.